సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట: స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి చావలి సూర్యనారాయణ శాస్త్రి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు.




అన్నదానానికి మేము సైతం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన కేవీ రాఘవరావు, లక్ష్మి దంపతులు సోమవారం రూ.1,00,016 విరాళాన్ని సమర్పించారు.

డెల్టాలకు 6,250 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,250 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,850, మధ్య డెల్టాకు 1,200, పశ్చిమ డెల్టాకు 3,200 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 7.70 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

స్పందనకు 236 అర్జీలు

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 236 అర్జీలు అందాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు కలిసి అర్జీలు స్వీకరించారు. వీటికి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. అమలాపురంలో అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు ఎత్తివేయడాన్ని నిరసిస్తూ దళిత సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం కోసం వైనతేయ నదికి కు అడ్డుకట్ట వేయడం వల్ల వేట కోల్పోతామంటూ సుమారు 20 సంఘాలకు చెందిన మత్స్యకారులు ధర్నా చేశారు. అంబాజీపేట మండలం మాచవరం పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని పాలకవర్గ సభ్యులు ఆందోళన చేశారు. ఇంకా వివిధ సమస్యలపై ఆయా వర్గాల వారు నిరసనలు తెలిపారు.

పోలీసు స్పందనకు 38..

అమలాపురం టౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 38 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ కె.లతామాధురి ఈ కార్యక్రమం నిర్వహించారు. పలు ఫిర్యాదులను ఎస్పీ, ఏఎస్పీలు అక్కడికక్కడే పరిష్కరించేలా ఆయా పోలీసు స్టేషన్ల ఎస్సైలతో మాట్లాడారు.

పురాతన భవనాలపై పరిశోధన



భవనం కొలతలు తీసుకుంటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: గ్రామంలోని పురాతన, పాత కాలం నాటి లోగిళ్లపై విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాలయం విద్యార్థులు మూడు రోజుల పాటు పరిశోధన నిర్వహించారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ విద్యాలయంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ఐదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో భాగంగా మొదటి సంవత్సరం చదువుతున్న 93 మంది విద్యార్థులు మూడు రోజుల పాటు ఇక్కడి పురాతన ఇళ్లపై పరిశోధన చేశారు. విద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ డి.శ్రీనివాస్, డాక్టర్ పి.సంతోష్, మరో నలుగురు అధ్యాపకులతో కలిసి ఇళ్లను సందర్శించారు. పురాతన భవనాలను నిర్మించిన తీరు, వాటి నాణ్యత, పునాదులు, పైకప్పు, గోడల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో శాస్త్రీయ అంశాలను నమోదు చేసుకుని, చర్చించుకున్నారు. ఇటువంటి విద్యాలయాలు దేశంలో మూడు మాత్రమే ఉన్నాయని శ్రీనివాస్, సంతోష్ చెప్పారు. గుజరాత్, బెంగళూరు, విజయవాడ, విశాఖ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు క్షేత్ర స్థాయి పరిశోధనకు కపిలేశ్వరపురాన్ని ఎంచుకున్నారన్నారు. తమ పర్యటనకు సహాయ సహకారాలందించిన సర్పంచ్ సాకా శ్రీనివాస్‌ను సత్కరించారు. ఇక్కడ పరిశోధన ముగించుకుని, వారు సోమవారం ఇతర ప్రాంతాలకు బయలుదేరారు.

నూకాంబిక హుండీల ఆదాయం రూ.22.66 లక్షలు



హుండీల నగదు లెక్కింపులో పాల్గొన్న అధికారులు, భక్తులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారికి హుండీల ద్వారా రూ.22.66 లక్షల ఆదాయం లభించింది. ఆలయంలోని ఏడు హుండీలను సోమవారం తెరచి, నగదు లెక్కించారు. అమ్మవారి ఆలయ ముఖ మండపంలో రామచంద్రపురం దేవదాయ శాఖ తనిఖీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో చైర్మన్ నూకపెయ్యి శ్రీనివాస్, ఈఓ ఉండవల్లి వీర్రాజు సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. గత నెల 10 నుంచి సోమవారం వరకూ 25 రోజులకు ఈ ఆదాయం లభించింది.

ఆంధ్రుల అన్నపూర్ణగా ఖ్యాతికెక్కి..
గుండె లోతుల్లోంచి వెల్లువలా పొంగే
ఆదరాభిమానాలను చవి చూపుతూ..
అచ్చ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు నేటికీ ఊపిరి పోస్తూ..
విభిన్న రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై కీర్తిపతాకలు
రెపరెపలాడిస్తున్న మన కోనసీమ..
పార్లమెంటరీ నియోజకవర్గం ప్రాతిపదికన ప్రత్యేక జిల్లాగా ఆవిర్భవించిన
సుదినం నేడు. ఇది లక్షలాది ప్రజల
స్వప్నం సాకారమైన రోజు.. వారి
చిరకాల కోరిక నెరవేరిన రోజు..

అమలాపురంలోని కలెక్టరేట్ (అంతరచిత్రం) జిల్లా మ్యాప్



జిల్లా స్వరూపమిదీ..

పేరు :	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
రెవెన్యూ డివిజన్లు :	3
(అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట)	
మున్సిపాలిటీలు :	3
(అమలాపురం, రామచంద్రపురం, మండపేట)	
నగర పంచాయతీ :	1 (ముమ్మిడివరం)
అసెంబ్లీ నియోజకవర్గాలు :	7
మండలాలు :	22
పంచాయతీలు :	385
గ్రామ సచివాలయాలు :	467
వార్డు సచివాలయాలు :	48
జనాభా :	17,19,000

నవ్య కీర్తి.. భవ్య దీప్తి

- కోనసీమ జిల్లా ఏర్పడి నేటికి ఏడాది
- కొత్త మార్పుతో మరింత వేగంగా ప్రగతి పయనం
- నెరవేరుతున్న ప్రజల ఆకాంక్షలు
- చెంతనే అందుతున్న సంక్షేమం

సాక్షి, అమలాపురం: లక్షలాది మంది ప్రజల దశాబ్దాల కలను నిజం చేస్తూ.. కోటి ఆశలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పడి మంగళవారానికి సరిగ్గా ఏడాది. ఈ సంవత్సర కాలం ఒకవైపు సవాళ్లను.. మరోవైపు ఆటుపోట్లను ఎదుర్కొంటూనే.. సామాన్యుల ఆకాంక్షను నెరవేర్చే దిశగా నవ్య జిల్లా పయనిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాల వారికి వారి ముంగిట్లోనే అందిస్తూ.. వివిధ శాఖల ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది కొత్త జిల్లా యంత్రాంగం. ప్రభుత్వ పాలనను సామాన్యులకు చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లాల పునర్విభజన చేపట్టిన ప్రభుత్వ ఆశయానికి.. ఈ ప్రాంతానికి సరికొత్త గుర్తింపు రావాలన్న ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నూతన జిల్లా ప్రగతి దారుల్లో పయనిస్తోంది.

చేరువైన పాలన

కొత్త జిల్లా ఏర్పడిన తరువాత పరిపాలన ప్రజలకు మరింత చేరువైంది. గతంలో జిల్లా స్థాయిలో ఏ పని ఉన్నా సుదూరాన ఉన్న కాకినాడ వెళ్లాల్సి వచ్చేది. ఉదాహరణకు అంతర్వేది నుంచి కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లాలంటే సుమారు 115 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు అమలాపురంలోనే కలెక్టరేట్ ఉండటంతో ఆ దూరం 48 కిలోమీటర్లకు పరిమితమైంది. జిల్లాలో ఎక్కడి నుంచి చూసినా కలెక్టరేట్ 50 కిలోమీటర్ల లోపే ఉంది. గతంలో దూరాభారం, వ్యయప్రయాసలు ఎదుర్కొనే వారు. తెల్లవారుజామునే బయలుదేరి వెళ్లాల్సి వచ్చేది. భోజనానికి కూడా ఇబ్బంది పడేవారు. ఇప్పుడు పెదగా ఖర్చు లేకుండానే జిల్లా కేంద్రానికి ఇలా వెళ్లి అలా వచ్చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు సైతం క్షేత్రస్థాయి పర్యటనలకు సులువుగా వెళ్లి వచ్చేస్తున్నారు. గతంలో పెద్ద జిల్లా కావడంతో పర్యటనకు వెళ్తే మరుసటి రోజు కార్యాలయాలకు వచ్చే పరిస్థితి ఉండేది కాదు.

❖ జిల్లాలు ఏర్పాటు చేస్తున్నారు సరే! పూర్తిస్థాయిలో అధికారులు ఉంటారా? కార్యాలయాలు ఏర్పాటు చేస్తారా? అని అప్పట్లో ప్రతి ఒక్కరిలోనూ సందేహాలు. కలెక్టరేట్‌ను అమలాపురం – ముక్తేశ్వరం రోడ్డులోని డీఆర్‌డీఏ భవనంలో ఏర్పాటు చేశారు. సమీపంలోనే ఎస్పీ కార్యాలయం ఉంది. పంచాయతీ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయాలు అమలాపురంలో, మిగిలిన కార్యాలయాలు ముమ్మిడివరం ఎయిమ్స్‌లో ఏర్పాటు చేశారు. పరిపాలన సూక్ష్మ స్థాయిలో వేగవంతంగా జరుగుతోంది.

❖ పునర్విభజన తరువాత జిల్లా విస్తీర్ణం తగ్గడంతో గోదావరికి రికార్డు స్థాయిలో వచ్చిన మూడో అతి పెద్ద వరదను అధికార యంత్రాంగం సమర్థంగా ఎదుర్కొంది. బాధితులను రక్షించడం, పునరావాసం కల్పించడంతో పాటు వరదల్లో చిక్కుకున్న వారికి ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనాలు అందేలా చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు మందులు, మంచినీరు, పాలు పడవలపై వెళ్లి అందించగలిగారు. వరద పూర్తిగా వీడకున్నా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందింది.

త్వరలో సాకారం కానున్న మెగా వాటర్ గ్రిడ్ నమూనా



చిన్నచిన్న సమస్యలకు సైతం పరిష్కారం



పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం చిన్న జిల్లాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఆశించిన విధంగానే ప్రజలకు పరిపాలన చేరువైంది. కొత్త జిల్లాలో డెల్టా ఆధునీకరణ పనులకు పెద్దపీట వేస్తున్నాం. రబీకి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా క్రాస్‌బండ్‌లు ఏర్పాటు చేసి, మోటార్లకు డీజిల్ అందించాం. డ్రెయిన్లలో పూడికతీత, గట్ల పటిష్టత పనులు చేపట్టాం. సీఎస్ఆర్ నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తున్నాం. వరదలను సమర్థంగా ఎదుర్కొన్నాం. అభివృద్ధికి సంబంధించి నిరంతరం సమీక్షలు జరపడం, క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయడం ద్వారా పనులు వేగవంతం చేయిస్తున్నాం.

– హిమాన్షు శుక్లా, జిల్లా కలెక్టర్

ప్రగతి పయనమిదిగో..

- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి డెల్టాకు తాగునీరు అందించే మెగా వాటర్ గ్రిడ్ పనులు రూ.1,650 కోట్లతో ఆరంభం కానున్నాయి.
- జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా జిల్లాలోని మొత్తం 1,764 నివాస ప్రాంతాల్లో ఇంటింటా కుళాయి పనులు రూ.303 కోట్లతో వేగంగా సాగుతున్నాయి.
- అమలాపురం – బొబ్బర్లంక రోడ్డును రూ.15.9 కోట్లతో ఆధునీకరించారు.
- రాజవరం – పొదలాడ రోడ్డును గన్నవరం నుంచి గంటి పెదపూడి వరకూ రూ.24 కోట్లతో, ఎల్.గన్నవరం నుంచి చాకలిపాలెం వరకూ రూ.9 కోట్లతో ఆధునీకరించారు.
- **పి.గన్నవరం మండలం** ఊడిమూడిలంక, **జి.పెదపూడిలంక, అరిగె**లవారిపేట, బూరుగు**లంకలకు చెందిన సు**మారు 3,500 మం**దికి ప్రయోజనం** కలిగేలా సుమారు **రూ.49.50 కోట్లతో వం**తెన నిర్మాణ పనులు **ఆరంభం కానున్నాయి.**
- **రాజోలు మండలం శివ**కోడు వంతెన నుంచి **సఖినేటిపల్లి రేవు మీ**దుగా నర్సాపురం **వరకూ బైపాస్ రోడ్డుకు** రూ.580.42 కోట్లు **మంజూరయ్యాయి.**
- **పాడి రైతుల కోసం** 149 బల్క్ మిల్క్ **కూలింగ్ యూనిట్లు** (బీఎంసీయూ), 157 **ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్** యూనిట్ల (ఏఎంసీయూ) **నిర్మాణాలు జో**రందుకున్నాయి.
- అయినవిల్లి మండలంలో రూ.300 కోట్లతో చేపట్టిన 440/132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల సేకరణ జరిగింది.
- వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటలను నిల్వ చేసుకునేందుకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు. రబీ నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం రూ.11.67 కోట్లు కేటాయించింది. గత ఖరీఫ్ సమయంలో పూడిక తొలగింపు, గుర్రపు డెక్క తీసేందుకు సైతం అత్యవసర నిధులు ఖర్చు చేశారు.
- ఇంకా అనేక అంశాల్లో జిల్లా చురుకుగా ముందడుగు వేస్తోంది.

ప్రశాంతంగా ప్రారంభం

- 'పది' పరీక్షలకు జిల్లాలో 19,199 మంది హాజరు
- 48 కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు

రాయవరం: పదో తరగతి పరీక్షలు సోమవారం ఉదయం జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ముందు నుంచీ జిల్లా విద్యా శాఖాధికారులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనివ్వడంతో ఎక్కడా సమస్యలు తలెత్తలేదు. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, ఫ్యాన్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించరనే నిబంధన ఉండటంతో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. చాలాచోట్ల కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు తమ విద్యార్థులను వారి పాఠశాలల వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాయి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు.. విద్యార్థుల వెంట ఉండి చివరి నిమిషం వరకూ సూచనలిచ్చారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు జరిగాయి.

111 కేంద్రాల్లో..

జిల్లా వ్యాప్తంగా 111 కేంద్రాల్లో 19,199 మంది విద్యార్థులు తొలి రోజు తెలుగు పరీక్ష రాశారు. 19,327 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 128 మంది గైర్హాజయ్యారు. ఇంగ్లిషు మీడియం నుంచి 13,880 మందికి 13,348 మంది, తెలుగు మీడియం నుంచి 5,947 మందికి 5,851 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తెలుగు మీడియం నుంచి 96, ఇంగ్లిషు మీడియం నుంచి 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99.34 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి తెలిపారు.

ఆకస్మిక తనిఖీలు

జిల్లాలోని రెండు సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లో కూడా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని విద్యా శాఖ అధికారులు తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఆర్‌జేడీ, జిల్లా పరిశీలకురాలు జి.నాగమణి, డీఈఓ కమలకుమారి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.రమణశ్రీతో పాటు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది కలిసి 48 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. తొలి రోజు పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

టెన్షన్‌గా..

తొలిసారిగా ఎదుర్కొనే పబ్లిక్ పరీక్షలు కావడంతో కొంతమంది విద్యార్థులు కాస్త టెన్షన్ ఫీలయ్యారు. పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకుని, వారి నంబర్లు ఏ గదిలో కేటాయించారో సరిచూసుకున్నారు. పలువురు విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లే ముందు వరకూ పుస్తకాలతో కుస్తీ పట్టడం కనిపించింది. పరీక్షలకు వెళ్లే ముందు కొంతమంది తమ ఇష్ట దైవాలకు ఆలయాల్లో పూజలు చేశారు.

టెన్త్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- పరీక్ష కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

అమలాపురం టౌన్: సమయ పాలన, నిబంధనలకు అనుగుణంగా వివిధ శాఖల సమన్వయంతో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం ఆరంభమైన పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆయన విద్యా శాఖ అధికారులను పలుమార్లు ఆరా తీశారు. అమలాపురం జెడ్పీ బాలికల హైస్కూలులోని కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును గదుల్లోకి వెళ్లి పరిశీలించారు. స్టోరేజీ పాయింట్ల నుంచి ప్రశ్నపత్రాల తరలింపుపై చీఫ్ సూపరింటెండెంట్లు, విద్యా శాఖ అధికారులతో చర్చించారు. బందోబస్తు నడుమ క్లోజ్డ్ వాహనాల్లో జవాబు పత్రాలను తరలించే ఏర్పాట్లపై పలు ఆదేశాలు ఇచ్చారు. పరీక్షలకు సంబంధించిన ప్రతి ప్రక్రియా ప్రభుత్వ నిబంధనలకు లోబడే జరగాలని స్పష్టం చేశారు. విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకూ లోను కాకుండా ప్రశ్నపత్రాన్ని ప్రశాంతంగా, క్షుణ్ణంగా చదివి, జవాబులు రాయాలని సూచించారు. విజయవంతంగా పరీక్షలు రాయాలని వారికి కలెక్టర్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్, ప్రధానోపాధ్యాయిని ఎస్ఎల్‌వీ బాల, డిపార్ట్‌మెంటల్ అధికారి, అయినవల్లి మండలం చింతల్లంక ప్రధానోపాధ్యాయుడు పీఈ రవిప్రసాద్‌లు కలెక్టర్ శుక్లాకు ఆ పరీక్ష కేంద్రం పూర్తి సమాచారాన్ని వివరించారు. ఇక్కడ 219 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.



టెన్త్ పరీక్షలను స్వయంగా పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా


కట్టుంగలో.. భూముల కనికట్టు

- ఆంజనేయ స్వామి సాక్షిగా అక్రమార్కుల భూమాయ
- టీడీపీ హయంలో రైతులకు ధారాదత్తం
- మళ్లీ అవే భూములకు వేలం
- దీనిపై వివాదం
- రీసర్వే చేయాలని తాజాగా ఈఓ దరఖాస్తు

ఆత్రేయపురం: అలనాడు లంకలో రావణాసురుడి చెరలో ఉన్న సీతమ్మ జాడ కనిపెట్టిన ఆంజనేయ స్వామి.. తన భూములను కాపాడుకోవడానికి ఆపసోపాలు పడుతున్నాడు. కోరిన కోర్కెలు తీర్చే కొండంత దేవుడు కట్టుంగ ఆంజనేయ స్వామి ఆలయ భూములు అక్రమార్కుల చెరలో చిక్కుకున్నాయి. ప్రస్తుతం ఈ భూములు కోర్టు వివాదంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం భూముల రీసర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ నేపథ్యంలో కట్టుంగ ఆంజనేయ స్వామి ఆలయ భూములపై పక్కాగా రీసర్వే చేసి తమకు టైటిల్ ఇవ్వాల్సిందిగా ప్రస్తుత కార్యనిర్వహణాధికారి (ఈఓ) బి.కృష్ణ చైతన్య రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ భూముల కబ్జా పర్వం మరోసారి చర్చనీయాంశమైంది.

వేలంలో దక్కినా.. దక్కని భూములు

ఆత్రేయపురం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కట్టుంగ గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి వారికి వివిధ ప్రాంతాల్లో భూములున్నాయి. వీటికి దశాబ్దాల కాలంగా కౌలు వేలం నిర్వహించలేదు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది రైతులకు వీటిని అప్పగించారు. దీనిపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో 2015లో నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 26.46 ఎకరాల భూములకు అప్పటి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.భ్రమరాంబ ఆధ్వర్యాన నాటి అధికారులు ఆలయ ప్రాంగణంలో మూడేళ్ల కాలానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ భూములు కావడంతో అధిక సంఖ్యలో పాటదారులు వేలంలో పాల్గొన్నారు. లొల్ల గ్రామంలో సర్వే నంబర్ 32/1లో 2.76 ఎకరాలు, 86/2లో 0.32 ఎకరాలు, 86/3లో 0.30 ఎకరాలు, 164/9లో 0.33 ఎకరాలు, 164/10బిలో 4.06 ఎకరాలు, 18/4లో 2.03 ఎకరాలు; కట్టుంగ గ్రామం 177/1 సర్వే నంబర్‌లో 3.59 ఎకరాలు, 170/9లో 0.24 ఎకరాలు; వసంతవాడలో 71/4లో 2.13 ఎకరాలు, 131/3లో 2.29 ఎకరాల భూములను పలువురు రైతులు వేలంలో దక్కించుకున్నారు. ఈ గ్రామాల్లోని మొత్తం 18.05 ఎకరాల భూములను అప్పట్లో రికార్డు స్థాయిలో ఏడాదికి రూ.6.91 లక్షల చొప్పున కౌలు వేలం పాడుకున్నారు. రికార్డు స్థాయిలో ఆదాయం రావడంతో ఆంజనేయ స్వామి వారి ధూపదీప నైవేద్యాలకు ఎటువంటి లోటూ ఉండదని భక్తులు భావించారు. కౌలుకు చేసుకునేందుకు 2018 వరకూ హక్కు పొందినప్పటికీ వారికి ఆ భూములు మాత్రం నేటికీ దక్కలేదు. వేలం ద్వారా వచ్చిన నిధులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి.



కట్టుంగ ఆంజనేయస్వామి వారు



నాటి టీడీపీ పెద్దల ఒత్తిళ్లతో..

నాడు దేవదాయ శాఖలో పని చేసిన ఓ అధికారి అప్పటి టీడీపీ పాలకుల అండదండలతో ఆలయ భూములను అన్యాక్రాంతం చేశారనే ఆరోపణలున్నాయి. వేలం నిర్వహించిన భూములను అంతకు ముందే కొందరు రైతులకు లీజు పేరుతో అమ్ముకున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వేలం పూర్తయిన తరువాత ఆ భూములు తమవేనంటూ ఆ రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2015లో వేలం పాడుకున్న వారికి భూములు దక్కలేదు. ఇటు చెల్లించిన సొమ్మూ దక్కలేదు. మరోపక్క ఈ భూముల్లో ఉన్న రైతులు 15 ఏళ్లుగా ఎటువంటి శిస్తులూ చెల్లించకుండా అప్పనంగా అనుభవిస్తూండటంతో దేవదాయ శాఖ ఆదాయానికి రూ.కోటి వరకూ గండి పడింది. దేవదాయ శాఖలోని కొందరు అధికారుల అండదండలతోనే కబ్జాదారులు కోర్టులను ఆశ్రయించి, ఆదాయం ఆలయానికి చెందకుండా అడ్డదారులు తొక్కుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కొందరు అక్రమార్కులు ఆక్రమించుకున్న భూములను రిజిస్ట్రేషన్ శాఖలోని కొందరు అవినీతిపరుల అండతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్టు చెబుతున్నారు. వేలం జరగక ముందే కొంతమంది రైతులకు ఆలయ భూములను ధారాదత్తం చేసిన విషయం నాటి అధికారికి తెలుసని, అయినప్పటికీ అప్పటి టీడీపీ పెద్దలు, ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు వేలం నిర్వహించారని అంటున్నారు. పాడుకున్న భూములను తమకు అప్పగించాలని వేలంలో భూములు దక్కించుకున్న కౌలుదారులు డిమాండ్ చేస్తున్నారు. భూముల రీసర్వే జరిగితే కోర్టులో రైతులు దాఖలు చేసిన కేసు కూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఆలయ భూములు ఏ మేరకు అన్యాక్రాంతమయ్యాయో తెలిసే అవకాశం ఉంటుంది. కట్టుంగ ఆంజనేయ స్వామి వారికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో 1.20 ఎకరాలు, చిలకపాడులో 3.70 ఎకరాలు, ముమ్మిడివరంలో 2 ఎకరాలు, పసలపూడిలో 1.50 ఎకరాల భూములున్నాయని, వాటిని కూడా అధికారులు స్వాధీనం చేసుకుని కౌలు వేలం నిర్వహించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

పక్కాగా రికార్డులు



కట్టుంగ ఆంజనేయస్వామి వారి భూముల రీసర్వేకు తహసీల్దార్‌కు, గ్రామ సచివాలయంలోను దరఖాస్తు చేశాం. ఆ భూములు ఎక్కడికీ పోవు. స్వామి వారి ఆలయ భూముల్లో వేలం నిర్వహించిన 18.06 ఎకరాలకు రికార్డులు పక్కాగా ఉన్నాయి. కోర్టు కేసు తేలిన తరువాత అప్పటి నుంచి వరుసగా మూడేళ్ల కాలానికి 2015లో వేలం పాడుకున్న వారికి ఆ భూములను అప్పగిస్తాం. నాటి వేలం ద్వారా సమకూరిన ఆదాయ వివరాలు సేకరిస్తున్నాం.

– బి.కృష్ణచైతన్య, ఈఓ

క్లుప్తంగా

249 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ఫిర్యాదీలకు అప్పగిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న 249 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి, ఫిర్యాదీలకు మీడియా సమక్షంలో అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు ఈ వివరాలు వెల్లడించారు. జిల్లా పోలీస్ శాఖ కొత్తగా పరిచయం చేసిన 'మొబీ ట్రాక్ కాకినాడ పోలీస్' ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతోందని అన్నారు. ఈ సేవలో భాగంగా నిర్ణీత మొబైల్ నంబరుకు మెసేజ్ చేయడం ద్వారా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్టు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దాని ఆధారంగా రెండు నెలల వ్యవధిలో 249 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీకి కృషి చేసిన ఐటీ కోర్ విభాగంతో పాటు సీసీఎస్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు



సత్యనారాయణ (పాతచిత్రం)

కొవ్వూరు: దేవరపల్లి మండలం యర్నగూడెంలోని తుపాకులగూడెం ప్రాంతానికి చెందిన యువకుడు ఇంజివరపు సత్యనారాయణ (25) సోమవారం సాయంత్రం రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదావరి నదిలో దూకి గల్లంతయ్యాడు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్న సత్యనారాయణ విధుల్లో భాగంగా మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బ్రిడ్జిపై 110వ స్తంభం వద్ద బైక్ నిలుపు చేసి, గోదావరి నదిలో దూకేశాడు. అదే సమయంలో సత్యనారాయణకు వరుసకు బావమరిది అయిన వ్యక్తి ఆర్టీసీ బస్సులో వస్తున్నాడు. అతడు ఈ విషయం గుర్తించాడు. అతడు బస్సు దిగి వెళ్లేసరికే సత్యనారాయణ నదిలో దూకేశాడు. అతడి ఆచూకీ కోసం నదిలో గాలింపు చేపట్టారు. సత్యనారాయణకు ఇంకా వివాహం కాలేదు. వివాహమైన ఇద్దరు అక్కలు ఉన్నట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. సత్యనారాయణ ఆత్మహత్యా యత్నానికి పాల్పడటానికి దారి తీసిన పరిస్థితులేమిటో తెలియాల్సి ఉంది.

అభాగ్యులకు వరం.. మిషన్ వాత్సల్య

- చిన్నారులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సహాయం
- దరఖాస్తుకు రేపటి వరకూ గడువు

ప్రత్తిపాడు రూరల్/బిక్కవోలు: విధి చిన్నచూపు చూసి, తల్లి, తండ్రి దూరమైన/కోల్పోయి, ఎటువంటి ఆదరణా లేని అభాగ్యులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు 'మిషన్ వాత్సల్య' పథకానికి శ్రీకారం చుట్టింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్ చేస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10,500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు లేదా దూరమైన వారు, పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయినవారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన, బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం–2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహ, హెచ్ఐవీ బాధిత, పీడిత బాలలు, దివ్యాంగులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.



వార్షికాదాయ పరిమితి

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సర ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు మించరాదు. జువనైల్ జస్టిస్ (జేజే) బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లే వారి హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలినా, పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేస్తారు.

మండల స్థాయి స్క్రూటినీ కమిటీ పరిశీలన

దరఖాస్తులను మూడు సెట్‌లుగా తయారు చేసి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇవ్వాలి. అక్కడి నుంచి ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నింటినీ తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, సీడీపీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లతో కూడిన మండల స్థాయి స్క్రూటినీ కమిటీ పరిశీలిస్తుంది.

ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తరువాత ఆ సమావేశం మినిట్స్‌తో పాటు దరఖాస్తులన్నిటినీ జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికార అధికారి కార్యాలయానికి సమర్పిస్తారు.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు

- బాలుడి/బాలిక జనన ధ్రువీకరణ పత్రం
- ఆధార్ కార్డు
- తల్లి, తండ్రి ఆధార్ కార్డులు
- తల్లి, తండ్రి డెత్ సర్టిఫికెట్
- గార్డియన్ ఆధార్
- రేషన్ కార్డు
- కుల ధ్రువీకరణ పత్రం
- బాలుడు, బాలిక పాస్‌పోర్టు సైజు ఫొటో
- స్టడీ సర్టిఫికెట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- బాలుడు లేదా బాలిక వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ లేదా తల్లి/తండ్రి/సంరక్షకులతో కలిసిన జాయింట్ అకౌంట్ వివరాలు

వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాం



'మిషన్ వాత్సల్య' పథకంపై వలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాం. అర్హులైన వారు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం.

– వెలగల విజయలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి, పందలపాక, బిక్కవోలు మండలం

ఉన్నతాధికారుల ఆదేశం



మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తులు స్వీకరించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ దరఖాస్తులు తీసుకోవాల్సిందిగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశాలు ఇచ్చాం. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను ప్రాజెక్టు అధికారులకు అందించాం. – శాంతి రత్నకుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్, ఊలపల్లి, బిక్కవోలు మండలం

దరఖాస్తుల స్వీకరణ



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. నిరాదరణకు గురైన వారి నుంచి ఈ నెల 5 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తాం. సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్, మహిళా పోలీసులు ఈ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం వాటిని సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలి. వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ కమిటీ పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – టి.పద్మావతి, సీడీపీఓ, మహిళా, శిశు సంక్షేమ, శంఖవరం

రీజియన్–2లో టెన్త్‌కు 1.77 లక్షల మంది విద్యార్థులు

- గతానికి భిన్నంగా పరీక్షలకు కట్టుదిట్టమైన చర్యలు
- 19 నుంచి మూల్యాంకనం
- పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి



రాయవరం పరీక్ష కేంద్రం వద్ద ఎంఈఓ సత్యనారాయణకు సూచనలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

రాయవరం: పాఠశాల విద్యాశాఖ రీజియన్–2 పరిధిలో 1,77,448 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) జి.నాగమణి తెలిపారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో రాయవరం శ్రీ రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలోని రెండు కేంద్రాలను ఆమె సోమవారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో తీసుకున్న చర్యలపై ఎంఈఓ సత్యనారాయణను అడిగి తెలుసుకుని, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, రీజియన్–2 పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఏడు జిల్లాల్లోని 2,964 పాఠశాలల నుంచి 91,476 మంది బాలురు, 85,672 మంది బాలికలు పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. 911 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిలో 226 ఎ, 413 బి, 272 సి కేటగిరీ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేని విధంగా పరీక్షలకు గతంలో ఎన్నడూ లేని విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. పరీక్షల అనంతరం ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకూ ఆయా జిల్లా కేంద్రాల్లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనానికి ఏర్పాట్లు చేశామన్నారు. మూల్యాంకన కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి ఒక రోజు ఓరియెంటేషన్ తరగతి నిర్వహించామని నాగమణి తెలిపారు.

శ్రీనివాసా.. గోవిందా..



పొన్న వాహనంపై స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

- పొన్న వాహనంపై దర్శనమిచ్చిన వెంకటేశ్వరస్వామి
- వాడపల్లిలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం: కల్యాణోత్సవాల్లో భాగంగా వాడపల్లి శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారు సోమవారం పొన్న వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లను పొన్నవాహనంపై కొలువుదీర్చి, గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకుని, ఉత్సవాలు తిలకించారు. ఉదయం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, బాలభోగం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ ఆవరణలో కళాకారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. భక్తులకు భారీగా అన్న సమారాధన నిర్వహించారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారికి మంగళవారం సదస్యం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.



అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

ఆఖరి మజిలీలో అన్నీ తానై..

- తల్లి మృతదేహానికి ట్రాన్స్‌జెండర్ అంత్యక్రియలు
- ఆఖరి చూపూ అక్కర్లేదంటూ వదిలేసిన కొడుకులు, బంధువులు



ప్రభావతి మృతదేహాన్ని ఖననం చేస్తున్న కావ్య

కాకినాడ క్రైం: నవమాసాలూ మోసి, కని పెంచిన కొడుకులున్నారు.. అయినవారందరూ ఉన్నారు.. అయినా ఆఖరి మజిలీలో ఆ తల్లిని పట్టించుకోలేదు. కడసారి చూపు కూడా వద్దనుకున్నారు.. దీంతో అన్నీ తానే అయి ఓ ట్రాన్స్‌జెండర్ ఆ పిచ్చితల్లికి అంతిమ సంస్కారం చేసింది. వివరాలివీ.. కాకినాడ పర్లోవపేటలోని రాజీవ్ గృహకల్ప ఫ్లాట్ నంబర్–8లో యల్ల ప్రభావతి (50) నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కొన్నేళ్ల క్రితం కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ దంపతులకు ఏడేళ్ల కుమారుడు లక్కీ ఉన్నాడు. భర్త బాధ్యతారాహిత్యాన్ని భరించలేక దుర్గాప్రసాద్ భార్య లక్ష్మి మరొకరితో వెళ్లిపోయింది. అప్పటి నుంచీ మనవడు లక్కీ, కొడుకు దుర్గాప్రసాద్‌తో కలిసి ప్రభావతి జీవిస్తోంది. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం దుర్గాప్రసాద్ కూడా వారిని వదిలిపెట్టి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. మనవడు లక్కీ అంటే ప్రభావతికి ప్రాణం. మనవడికి ఏ లోటూ రానిచ్చేది కాదు. తాను తిన్నా తినకపోయినా తనకు వచ్చే వైఎస్సార్ వితంతు పెన్షన్‌తో ఉన్నంతలోనే ఆ పసివాడిని కంటికి రెప్పలా చూసుకునేది. ఇది చూసి చుట్టుపక్కల వారు అబ్బురపడేవారు.

ఇదిలా ఉండగా, గత నెల 30వ తేదీన కోడలు లక్ష్మి ఉన్నట్టుండి వచ్చింది. ఇంట్లోని పలు సామగ్రిని తనవంటూ తీసుకువెళ్లిపోబోయింది. అయితే తమ వద్ద చేసిన అప్పు తీర్చి సామాన్లు తీసుకెళ్లమంటూ ఆమెను చుట్టుపక్కల వారు నిలువరించారు. దీంతో తీవ్ర ఆగ్రహంతో అత్త ప్రభావతితో లక్ష్మి గొడవ పడింది. కావాలనే అప్పుల వాళ్లను పిలిచావంటూ మండిపడింది. తగిన శాస్తి చేస్తానని బెదిరించింది. తను కన్న కొడుకు లక్కీని తనకు ఇచ్చేయమంటూ పట్టుబట్టింది. బలవంతంగా తీసుకెళ్లిపోతుంటే ప్రభావతి ఏడుస్తూ కాళ్లావేళ్లా పడింది. చుట్టుపక్కల వారు అడ్డుకునే ప్రయత్నం చేసినా, తన కొడుకునే తీసుకువెళ్తున్నానంటూ లక్కీని తీసుకుని లక్ష్మి వెళ్లిపోయింది. మనవడిపై బెంగతో ఏడుస్తున్న ప్రభావతిని ఇరుగు పొరుగు వారు రాత్రి ఓదార్చి పడుకోమని చెప్పి వెళ్లారు. ఉదయం చూసేసరికి ప్రభావతి ఇంట్లో విగతజీవిగా కనిపించింది. పక్కనే ఉన్న గ్లాసులో మామిడి కాయలు మగ్గించే కాల్షియం కార్బయిడ్ ద్రావణాన్ని గుర్తించారు. ఆమె మృతి విషయం ఆ ప్రాంతంలో అందరికీ తెలిసినా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. సమాచారం ఇచ్చినా సమీపంలోని బంధువులూ రాలేదు.

అదే ఫ్లాట్ సమీపంలో ట్రాన్స్‌జెండర్ కావ్య నివాసం ఉంటోంది. ప్రభావతి దుస్థితి గమనించి చలించిపోయింది. జరిగిందంతా హైదరాబాద్‌లో ఉంటున్న సర్వీస్ హార్ట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్‌కు ఫోన్‌లో వివరించి, సహాయం కోసం అర్థించింది. ఆయన సూచనల మేరకు ప్రభావతి మృతదేహాన్ని కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్‌కు అంబులెన్సులో తీసుకెళ్లింది. ప్రభావతి మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌కు తరలించాలని సూచించారు. వారి సూచనల మేరకు ప్రభావతి మృతదేహాన్ని కావ్య జీజీహెచ్ మార్చురీకి తరలించింది. తల్లి మరణంపై కుమారుడికి పోలీసులు సమాచారం ఇచ్చినా రాలేనని చెప్పాడు. సమీప బంధువులు, రక్త సంబంధీకుల రాక కోసం ఎదురు చూశారు. ఏ ఒక్కరూ రాకపోవడంతో ఫోరెన్సిక్ వైద్యులు ప్రభావతి మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె మృతదేహాన్ని అంబులెన్స్ డ్రైవర్ సాయంతో కాకినాడ బస్టాండు వద్ద ఉన్న శ్మశాన వాటికకు కావ్య తరలించింది. ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అంబేడ్కర్ సాయంతో ప్రభావతి మృతదేహాన్ని ఖననం చేసింది.

నమ్మించి.. వంచించి..

- 4.50 కిలోల బంగారు నగలు మాయం చేసింది గుమస్తాయే..
- ప్రాథమికంగా గుర్తించిన పోలీసులు

కొవ్వూరు: పట్టణంలో చేపబొమ్మ వీధిలోని బంగారు నగల తనఖా దుకాణం(పాన్ బ్రోకర్)లో 4.50 కేజీల బంగారు నగలు మాయం కావడం పట్టణంలో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం వెలుగు చూడటంతో తనఖాదారుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఘటనపై దుకాణ యజమాని కితేష్ కుమార్ జైన్ ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ కేసు నమోదు చేశారు. ఇదే షాపులో పని చేస్తున్న శెట్టి రాము అనే వ్యక్తిని నిందితుడిగా భావిస్తున్నారు. అతడు ఎనిమిదేళ్లుగా ఇక్కడే పని చేస్తున్నాడని చెబుతున్నారు. రామును విశ్వసించడంతో జైన్ తాళాలు సైతం అతనికే ఇచ్చేవాడంటున్నారు. తనపై యజమానికి ఉన్న నమ్మకాన్ని అడ్డం పెట్టుకుని దశల వారీగా రాము నగలు మాయం చేసినట్టు పోలీసుల ప్రాథమికంగా నిర్ధారించారు. అతడు తన అవసరాలకు కొన్ని నగలు తీసుకువెళ్లి వేరొకచోట తనఖా పెట్టి సొమ్ములు తీసుకున్నట్టు గుర్తించారు. ఇప్పటికే రాము ఐదారుచోట్ల నగలు తనఖా పెట్టినట్టు సమాచారం. ఇదే దుకాణ యజమాని వద్ద సుమారు ఇరవై ఐదేళ్ల పాటు పని చేసిన ఓ గుమస్తా కూడా గతంలో సుమారు రూ.25 లక్షల వరకూ మోసం చేశాడని తెలిసింది. తాజా కేసును డీఎస్పీ వీవీఎస్ వర్మ సవాల్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. జైన్, ఆయన కుమారుడు అకౌంట్లు చూసుకునే నిమిత్తం నగలు బయటకు తీయడంతో అవి మాయమైన విషయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు.